BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ 27-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు


# తెలంగాణ రైజింగ్ ఆగేదేలే..

## ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

- ఏడాదిలోనే అత్యధిక పెట్టుబడులు సాధించాం
- ఉద్యోగ కల్పనలో నంబర్ వన్ గా నిలిచాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సీఎం




**మహా, హైదరాబాద్:** 'తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు.. నేను చెప్పినప్పుడు ఎవరూ నమ్మలేదు.. ప్రస్తుతం ప్రపంచంచ స్థాయి నగరంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ మాదాపూర్ లో గురువారం హెచ్ సీఎల్ టెక్ నూతన క్యాంపస్ ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మల్టినేషనల్, బడా కార్పొరేట్ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అత్యధిక పెట్టుబడులు రాబట్టగలిగామన్నారు. ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని, ఎక్కువ ఏఐ వినియోగం తక్కువ ద్రవోల్బణంతో ముందుకు వెళ్తున్నారు చెప్పారు.

**వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీయే లక్ష్యం**

ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని, ఎక్కువ ఏఐ వినియోగం తక్కువ ద్రవోల్బణంతో ముందుకు వెళ్తున్నారు సీఎం చెప్పారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని, తాను ముందు చెప్పినప్పుడు... అది సాధ్యం కాదని కొందరు అన్నారన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారని తెలిపారు. మా పోటీ ముంబై, ఢిల్లీ, బెంగళూరు లేదా చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు... కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. మనం ఈవీ అడాప్షన్ లో హైదరాబాద్ ను నంబర్ వన్ గా చేశాక... రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ కు హబ్ గా మారుస్తున్నాం.. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదని ప్రజలే అంటున్నారని సీఎం అన్నారు. 'నేను మొదట హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి అనుమానం వచ్చింది. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్ ను కొద్దిరోజుల క్రితం ప్రారంభించుకున్నాం. మేం ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాలలో ఒకటైన బయో ఏషియాను నిర్వహించాం.. ఇవాళ హెచ్ సీ ఎల్ లో ఉన్నాం. గ్లోబల్ కంపెనీగా హెచ్ సీ ఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హెచ్ సీఎల్ భారతదేశాన్ని గర్వంపడేలా చేస్తోందని 60 దేశాల్లో 2.2 లక్షల మందితో పని చేస్తున్నదని కొనియాడారు. 2007 లో హైదరాబాద్ లో అడుగుపెట్టిన హెచ్ సీఎల్ ఇప్పుడు భారీగా ఎదిగిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా హెచ్ సీఎల్ కూడా తెలంగాణలో అద్భుతంగా పని చేస్తున్నదన్నారు.

**నైపుణ్యాల కోసమే స్కిల్ వర్సిటీ ఏర్పాటు: మంత్రి శ్రీధర్‌బాబు**

యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని సీఎం ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని అందుకే ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఈఎన్‌సీలతో క్రాస్ ఎగ్జామినేషన్

- నలుగురిని ఒకేసారి కూర్చోబెట్టి విచారణ
- అధికారుల తీరుపై కాళేశ్వరం కమిషన్ అసహనం





**మహా, హైదరాబాద్:** కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ , అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణాల్లో అవకతవకలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ గడువును ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లోని బీఆర్‌కే భవన్ లో ఉన్న కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ పున: ప్రారంభమైంది. ఈ విచారణకు గజ్వేల్ ఈఎన్‌సీ హరిరాం తో పాటు మాజీ ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్ , కాళేశ్వరం మాజీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు , మాజీ ఈఎన్‌సీ (సీడీవో) నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఇప్పటికే వారంతా కమిషన్ ఎదుట బహిరంగ విచారణకు హాజరై కమిషన్ అడిగిన ప్రశ్నలకు తమ స్టేట్ మెంట్‌తో పాటు అఫిడవిట్లు కూడా సమర్పించారు. అయితే, అనూహ్యంగా అఫిడవిట్, విచారణలో చెప్పిన విషయాలకు ఎక్కడ పొంతన లేనట్లుగా కమిషన్ సభ్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారిని మరోసారి విచారించాలంటూ కమిషన్ వారిని విచారణకు రావాలంటూ సమాచారం అందజేసింది. దీంతో ఈఎన్‌సీ లు మరోసారి బహిరంగ విచారణకు హాజరయ్యారు.

**నిజాలను చెరిపివేయొద్దు..**

నల్లా వెంకటేశ్వర్లు, హరీరాం, మురళీధర్ రావు, నరేందర్ రెడ్డిలను ఒకేసారి కూర్చోబెట్టి కమిషన్ విచారణ జరిపారు. చేసిన ప్రతిజ్ఞకు న్యాయం చేయాలని... నిజాలను చెరిపి వేయొద్దన్న కమిషన్ సూచించారు. ఇంజనీర్లు పలు డాక్యుమెంట్లను దాచడంపై కమిషన్ అసహనం వ్యక్తం చేశారు. డిజైన్స్, డీపీఆర్, నిర్మాణ సంస్థలకు ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందాలపై కమిషన్ ప్రశ్నలు సంధించారు. అన్నారం, సుందిళ్ల, లొకేషన్ మార్పు ఎవరి ఆదేశాల మేరకు జరిగిందని కమిషన్ ప్రశ్నించింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు లొకేషన్ మార్చామన్న అధికారులు వెల్లడించారు. బ్యారేజీలలో నీళ్లను నింపాలని ఎవరు ఆదేశించారన్న కమిషన్ ప్రశ్నించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ఇరిగేషన్ మినిస్టర్ ఆదేశాల మేరకే నీళ్లను స్టోరేజ్ చేశామన్న అధికారులు తెలిపారు. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు మాజీ ఈఎంసీ జనరల్ మురళీధర్ రావు గుర్తుకు లేదని చెప్పారు. జీవో నెంబర్ 28 పై నలుగురు అధికారులను కమిషన్ ప్రశ్నిస్తే అధికారులు మౌనంగా ఉన్నారు.

# రేవంత్‌రెడ్డికి కేసీఆర్ ఫోబియా

- అప్పులు.. ఆదాయంపై అబద్ధాలు
- మా కుటుంబం మీద దాడి తప్ప మరొకటిలేదు..
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫైర్




**మహా, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన నేపథ్యంలో, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. గురువారం మీడియాతో కవిత మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రస్తుతం కేసీఆర్ ఫోబియాలో ఉన్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామని చెప్పడం, వాస్తవాలను వక్రీకరించడం తప్ప మరేదీ కాదన్నారు. 202425 కాగ్ రిపోర్ట్ ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం ఏడాదికి రూ. 22,000 కోట్ల వడ్డీలు కట్టిందని, కానీ దీనికి కారణం గత ప్రభుత్వ పాలన కాదని కవిత స్పష్టం చేశారు. కేసీఆర్ 4.3లక్షల కోట్ల అప్పులు చేశారని..పెట్టిన ఖర్చు, అభివృద్ధి కూడా మేం అనేక పర్యాయాలు చట్టసభలలో వెల్లడించామని గుర్తు చేశారు. రాష్ట్రానికి 18వేల కోట్ల ఆదాయం వస్తుందని ఢిల్లీలో రేవంత్ రెడ్డి చెప్పారని..యావరేజీగా చూస్తే 12వేల కోట్ల ఆదాయం వస్తుందని తేలిందని.. మరి ఎందుకు సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కవిత ప్రశ్నించారు. కట్టని అప్పులు కడుతున్నామని.. పెరగని ఆదాయం పెరిగిందని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడం విస్మయం కలిగించిందన్నారు.

**హైడ్రాయే కారణం..**

రాష్ట్ర ఆదాయం పడిపోవడానికి హైడ్రా కారణమని కవిత ఆరోపించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం 18వేల కోట్ల అంచనా నుంచి 5,800కోట్లకు పడిపోయిందని.. అయినా అరాచకం ఆపకుండా మలక్ పేటలో నిన్న ఇళ్లు కూల్చారన్నారు. హైడ్రాతో హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్ నాశనం చేస్తున్నారన్నారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు కేసీఆర్ హయాంలో మూలనపడేయడంతోనే ఇప్పటి ప్రమాదానికి కారణమని రేవంత్ రెడ్డి ఆరోపించడం సత్యదూరమని కవిత మండిపడ్డారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులకు సాంకేతిక అడ్డంకుల గురించి గతంలో కేసీఆర్ స్పష్టంగా అప్పటి ప్రతిపక్ష నేత జానారెడ్డి ఆధ్వర్యంలో అఖిప పక్షానికి చెప్పారని కవిత తెలిపారు. అప్పట్లో కాంట్రాక్టర్ కు 100కోట్లు ఇచ్చారని..కరోనా సమయంలో మరోసారి అఖిల పక్షం సాక్షిగా కేసీఆర్ మరో 100కోట్ల ఇచ్చారన్నారు. టీడీపీ, కాంగ్రెస్ పాలనలో 30ఏళ్లలో 3,340కోట్లు ఖర్చు చేస్తే.. కేసీఆర్ పదేళ్లలో 3,890కోట్లు ఖర్చు చేసి 11.5కిలోమీటర్ల సొరంగం త్రవ్వారని..ఇంత ఖర్చు చేసి పనులు చేస్తే కేసీఆర్ ప్రభుత్వం అసలే పని చేయలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడం విడ్డూరమన్నారు.

# రాజమౌళి టార్చర్ భరించలేపోతున్నా

- ఆత్మహత్య చేసుకుంటా: శ్రీనివాసరావు
- ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేయాలని విన్నపం



**మహా, హైదరాబాద్:** తెలుగు సినీ పరిశ్రమ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు చాటిన దర్శక దిగ్గజం రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. రాజమౌళిపై ఆయన స్నేహితుడు శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజమౌళి టార్చర్ ను భరించలేకపోతున్నానని... ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియోతో పాటు ఒక లేఖను కూడా విడుదల చేశారు. ఇదే నా మరణ వాంగ్మూలం అని పేర్కొన్నారు. రాజమౌళిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. రాజ మౌళిపై శ్రీనివాసరావు చేసిన ఆరోపణలు టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారాయి. యమదొంగ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా శ్రీనివాస్ రావు వ్యవహరించారు. రాజమౌళితో దాదాపు 34 ఏళ్ల స్నేహం ఉందని అయితే ఓ అమ్మాయి కారణంగా మా మధ్య ట్రయంగిల్ లవ్ స్టోరీతో విభేదాలు మొదలయ్యాయన్నారు. ముందు రాజమౌళి..ఆ తర్వాత నేను ప్రేమించానని..అయితే కేరియర్ బిగినింగ్ టైమ్ లో వివాదం వద్దనుకుని.. రాజమౌళి కోరిక మేరకు నేను ఆ అమ్మాయిని త్యాగం చేశానని చెప్పారు. ఇన్నాళ్ల కు అతను నెంబర్ వన్ డైరెక్టర్ అయ్యాక గతంలోని విషయాలు ఎవరికో చెప్పానన్న అనుమానంతో నన్ను వేధించడం మొదలు పెట్టాడని..దీంతో అతని టార్చర్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని వీడియోలో, లెటర్ లో శ్రీనివాస రావు ఆరోపించారు.

# ఎమ్మెల్సీ పోలింగ్‌లో తీవ్ర ఉద్రిక్తత..

- రాళ్లు రువ్వుకున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు
- మంచిర్యాల జిల్లాలో ఘటన





**మహా, హైదరాబాద్:** తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతపై స్థానిక ఎస్ఐ చేయి చేసుకున్నారని పేర్కొంటూ కార్యకర్తల ఆందోళనకు దిగారు. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసు కెళ్లాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లను స్థానికులు బహిష్కరించారు. తమ మండలంలో రోడ్లు వేయలేదని ఓటింగ్ బహిష్కరించారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కు 244 మంది ఓటర్లు దూరంగా ఉన్నారు.







## పోలింగ్ సరళి పరిశీలించిన కంది

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పర్యవేక్షించారు. గురువారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలో కార్యకర్తలతో కలిసి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు.



# ఓటింగ్ సరళిపై పీసీసీ చీఫ్ ఆరా

## తెలంగాణ వ్యాప్తంగా ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

**మహా, హైదరాబాద్:** పట్టభద్రుల మండలి ఎన్నికల ఓటింగ్ సరళిని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ నుంచి పరిశీస్తున్నారు. ఎప్పటికప్పుడు మండల, నియోజక వర్గ స్థాయి నాయకులతో మాట్లాడుతున్నారు. తెలంగాణలో ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలి వచ్చారు. ఉమ్మడి కరీంగనర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉమ్మడి వరంగల్ ఖమ్మంనల్గొండ జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగుతున్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56 మంది అభ్యర్థులు బరిలో నిలవగా కరీంనగర్ మెదక్ నిజామాబాద్‌ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ బరిలో 15 మంది, వరంగల్ ఖమ్మంనల్గొండ టీచర్ ఎమ్మెల్సీ బరిలో 19 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మూడు స్థానాల్లో ఓటింగ్ కోసం 973 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయసంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. పోలింగ్ జరుగుతున్న విధానం తెలుసుకునేందుకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ పోలింగ్ కు సంబంధించిన ఓట్ల లెక్కింపు మార్చి 3న చేపట్టబోతున్నారు.

